న్యూస్‌రీల్

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న అఖిల్‌శర్వాన్

బెల్లంపల్లి: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సీఓఈ గురుకుల విద్యాలయం 9వ తరగతి విద్యార్థి అఖిల్ శర్వాన్ ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ భారతి హోళ్లికేరి, జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ చేతుల మీదుగా బుధవారం మెమోంటో ,సర్టిఫికేట్‌ను అందుకున్నాడు.

ఆటల పోటీలు

మంచిర్యాలఅర్బన్: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్న క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, టెన్నిస్, చెస్, వ్యాసరచన, పాటలు, ముగ్గుల పోటీలు బుధవారం ముగిశాయి. ఐటీఐ ట్రేడ్‌తో పాటు కంప్యూటర్, ఫ్యాషన్ డిజైన్‌కు చెందిన విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు జనవరి 26న ప్రశంసపత్రంతో పాటు జ్ఞాపికలతో సత్కరించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు.

వినతిపత్రం అందజేత

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లో సర్వేస్ డిపార్టుమెంట్‌లో పని చేసే కార్మికులకు చలికాలం ఇవ్వాల్సిన స్వెట్టర్లను వెంటనే ఇవ్వాలని సీఐటీయూ నాయకులు జీఎం సంజీవరెడ్డికి వినతిపత్రం అందించారు. మిషన్ సెక్షన్‌లో డస్ట్ అలవెన్స్ ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ బ్రాంచీ కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కస్తూరి చంద్రశేఖర్, ఎస్సార్పీ 1 ఫిట్ సెక్రెటరీ సుధాకర్ పాల్గొన్నారు.

'పేదలకు అండగా ప్రభుత్వం'



భీమారం: చెక్కులు పంపిణీ చేస్తున్న సరోత్తంరెడ్డి

భీమారం: పేద ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చెర్కు సరోత్తంరెడ్డి తెలిపారు. భీమారం మండల కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరైన లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ జర్పుల రాజ్‌కుమార్, మార్కెటింగ్ డైరెక్టర్ బుక్యా రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన బత్తిని మధు అనే వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.19వేల చెక్కు మంజూరు కాగా బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుర్ర రాకేష్ గౌడ్, ఎంపీటీసీ నగావత్ శ్రీనివాస్, టీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బొమ్మ శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి దివాకర్ పాల్గొన్నారు.

రేషన్‌షాపు తనిఖీ



తనిఖీ చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్,డీఎస్‌వో

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి బజారు ఏరియాలో ఉన్న ఓ రేషన్‌షాపును బుధవారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీఎస్‌వో ప్రేమ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ షాపుకు వెళ్లిన జిల్లా అధికారులు షాపులో ఉన్న బియ్యం నిల్వలను పరిశీలించారు. రిజిష్టర్లను పరిశీలించి దాదాపు 20క్వింటాళ్ల రేషన్ బియ్యం స్టాక్ లేనట్లుగా గుర్తించారు. తక్కువ బియ్యం కలిగి ఉన్నందుకు గాను 29వ రేషన్‌షాపు డీలర్‌ను సస్పెన్షన్ చేయాలని డీఎస్‌వో ప్రేమ్‌కుమార్‌ను ఆదేశించారు.

గడపగడపకూ పీఎస్‌ఆర్



క్యాలెండర్ పంపిణీ చేస్తున్న సురేఖ

శ్రీరాంపూర్: ప్రజల సేవ కోసమే పీఎస్‌ఆర్ పని చేస్తున్నారని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తెలిపారు. గడపగడపకూ పీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె నస్పూర్ పరిధిలోని 16వ వార్డు కటిక దుకాణాల ఏరియాలో ఇంటింటికీ పర్యటించారు. ఈ సందర్భంగా పీఎస్‌ఆర్ సేవా కార్యక్రమాలతో కూడిన న్యూఇయర్ క్యాలెండర్‌ను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లావణ్య, నాయకులు శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, మహేశ్, శ్యామల పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



కోటపల్లి: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో



చెన్నూర్‌లో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



భీమారంలో ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీవో



వేమనపల్లిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో



జిల్లా కేంద్రంలో ఓటరు ప్రతిజ్ఞ



బెల్లంపల్లిరూరల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే



బెల్లంపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్

సాక్షి నెట్‌వర్క్: ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు వజ్రాయుధమని అధికారులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకుని మెరుగైన సమాజ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, పాఠశాలల్లో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యతను వివరించారు. అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఓటరు ప్రతిజ్ఞ చేశారు. బెల్లంపల్లి మండలంలోని లంబాడితండాలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పాల్గొని 18సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు కలిగి ఉండాలని సూచించారు. లక్సెట్టిపేటలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించడానికి మాక్ పోలింగ్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో 'సమాజంలో ఓటు విలువ-ప్రాముఖ్యత' పై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



లక్సెట్టిపేట: తహసీల్దార్ కార్యాలయంలో ప్రతిజ్ఞ



మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు



కన్నెపల్లిలో ఓటరు ప్రతిజ్ఞ



దండేపల్లిలో ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు



నెన్నెల: ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది



తాండూర్: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది, వయోజనులు



జన్నారం: తపాలపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- కంటి వైద్య శిబిరాలు ప్రారంభం



బెల్లంపల్లిరూరల్: శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లిరూరల్: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని లంబాడితండాలో బుధవారం ఏర్పాటు చేసిన కంటివెలుగు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో రాజేందర్, సర్పంచ్‌లు రాయమల్లు, రంజిత, అశోక్, ఎంపీటీసీలు శకుంతల, సుభాష్, పీహెచ్‌సీ వైద్యుడు అనీష్, వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ నాగరాజు, కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని చెల్లాయిపేటలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీడీవో టి.శ్రీనివాస్ పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ డెబ్బ రవిందర్, పంచాయతీ కార్యదర్శి శ్వేత ఉన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రి ప్రాంగణంలో...

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి 19వార్డు బెల్లంపల్లి బస్తీలో కంటి వెలుగు శిబిరాన్ని కౌన్సిలర్ కొమ్ముల సురేష్ ప్రారంభించారు. కంటి వెలుగు శిబిరాన్ని ప్రభుత్వ కార్యాలయంలో కానీ, పాఠశాలల్లో కానీ ఏర్పాటు చేయాల్సి ఉండగా బస్తీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రారంభించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌ను 'సాక్షి' వివరణ కోరగా వార్డు పరిధిలో సరైన సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ భవనం లేకపోవడంతో, అనివార్యంగా ఆ ఆసుపత్రి ప్రాంగణంలోని ఓ గదిలో కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రికి కంటి వెలుగు శిబిరానికి సంబంధం లేకుండా ఉందని తెలిపారు. మహిళా వైద్యసిబ్బందిని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి



మాట్లాడుతున్న డీఈ భావ్‌సింగ్

నస్పూర్: పట్టణ పరిధిలోని తోళ్లవాగు నుంచి శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వరకు చేపట్టిన జాతీయ రహదారి 63విస్తరణకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, ఆర్‌అండ్‌బీ డీఈ భావ్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ రమేశ్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తోళ్లవాగు నుంచి శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వరకు గల జాతీయ రహదారికి ఇరువైపులా రేకుల షెడ్లు, ర్యాంప్స్, టేలాలు, తదితర కట్టడాలను అక్రమంగా ఏర్పాటు చేసుకున్న వారందరికీ వాటిని తొలగించాలని నోటీసులు జారీ చేశామని తెలిపారు. నోటీసులు అందుకున్న ఏడు రోజుల్లో తొలగించకపోతే, పురపాలక చట్టం 2019, సెక్షన్ 185సబ్‌సెక్షన్ (4)ను అనుసరించి వాటిని కూల్చివేయనున్నట్లు తెలిపారు.

జంతు సంరక్షణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: జంతు సంరక్షణ పక్షోత్సవాలను పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీని పశుసంవర్ధక శాఖ సంయుక్త డైరెక్టర్ రమేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(జీ) అధికరణ ప్రకారం జంతువుల సంరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అన్నారు. అడవులు, వన్యప్రాణులు, సరస్సులు, నదులు, సహజ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్, సెక్టోరల్ అధికారి కె.చౌదరి, ఉపాధ్యాయుడు యోగేశ్వర్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఉదయ్, వర్మ, నీల్‌కమల్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న కృష్ణదేవరాయలు

బెల్లంపల్లి: విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని పరీక్ష పే చర్చ ప్రోగ్రాం బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీ కృష్ణదేవరాయలు తెలిపారు. బెల్లంపల్లిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ విద్యార్థులతో పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షకు ఏ తీరుగా ప్రిపేర్ కావాలో నిర్దేశించినట్లు తెలిపారు. విద్యార్థులు మానసిక వొత్తిడికి గురికాకుండా ఉండాలని, శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోడి రమేశ్, శేషుకుమార్, రాజలింగు, రాజ్‌కుమార్, విజయ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దందాల జోరు.. పట్టించుకోరూ..!



తెప్పల్లో తెచ్చి ట్రాక్టర్లలో నింపుతున్న ఇసుక

దండేపల్లి/మందమర్రిరూరల్: ఇసుక అక్రమ రవాణా దండేపల్లి మండలం ద్వారక నదీ తీరం నుంచి జోరుగా సాగుతోంది. నదిలో నీళ్లు ఉన్నప్పటికీ తర్మాకోల్ తెప్పలతో వెళ్లి ఇసుకను తోడి ఒడ్డుకు తెస్తున్నారు. ఒక తెప్ప ద్వారా ఒక ట్రాక్టర్ లోడ్ ఇసుకను ఒడ్డుకు తెచ్చి, ట్రాక్టర్లలో నింపి తరలించాల్సిన చోటికి తరలిస్తున్నారు. ఇసుకను నీళ్లలోంచి తోడేందుకు గోదావరిలో ఆరుకు పైగా తెప్పలు నడుస్తున్నాయి. ఇసుక తరలింపుకు ఎలాంటి అనుమతులు లేకున్నా, దర్జాగా ఇసుక దందా సాగుతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో అడ్డుఅదుపు లేకుండా దందా కొనసాగిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ హన్మంతరావును వివరణ కోరగా విషయాన్ని మైనింగ్ డిపార్ట్‌మెంట్ వారి దృష్టికి తీసుకెళ్లి, వారితో కలిసి ఇసుక అక్రమ రవాణాను అరికడతామన్నారు.

– మందమర్రిలో మట్టి దందా రోజురోజుకు పెరిగిపోతుంది. అధికారుల అనుమతులు లేకుండా ఇష్టమొచ్చినట్లు అక్రమార్కులు మట్టిని తోడేస్తున్నారు. రాత్రి సమయాల్లో ప్రభుత్వ పనుల పేరిట కాంట్రాక్టర్లు అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతూ లక్షలు గడిస్తున్నారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఓ కాంట్రాక్టర్ మందమర్రి, బెల్లంపల్లి సరిహద్దు శివారు నుంచి జేసీబీ ద్వారా లారీలతో మట్టిని అక్రమంగా తోడుకు వచ్చినట్టు సమాచారం. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాల చుట్టూ తోడడంతో గాలివీస్తే పడిపోయేలా ఉన్నాయి. ఈ విషయమై తహసీల్దార్ సంపతి శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఎలాంటి పనులకైనా మట్టి కావాలంటే అనుమతులు తీసుకోవాల్సిన అవసరముందని, మందమర్రి, బెల్లంపల్లి సరిహద్దుల్లో తోడిన మట్టికి నా వద్ద నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదన్నారు.



మట్టి తోడడంతో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

ఆర్కే 5 గని ఉద్యోగులకు బహుమతులు

శ్రీరాంపూర్: సింగరేణి వ్యాప్తంగా ఇటీవల జరిగిన విజిలెన్సు వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఆర్కే5 గనికి చెందిన పలువురు ఉద్యోగులు బహుమతులు సాధించారని గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా స్థాయిలో ఉద్యోగుల్లో బొమ్మిడేని రంజిత్‌కుమార్, జనరల్ మజ్దూర్‌కు ప్రథమ స్థానం, ఎండీ ఇబ్రహీం, సీనియర్‌మైనింగ్ సర్దార్‌కు ద్వితీయ స్థానం, కంపెనీ స్థాయిలో అధికారుల్లో గజ్జి సునిల్‌కుమార్, సీనియర్ అండర్ మేనేజర్‌కు ద్వితీయ స్థానం, ఉద్యోగుల్లో రెడపాక నర్సయ్యకు కన్సోలేషన్ బహుమతి సాధించారు. వీరికి గురువారం ప్రగతి మైదానంలో జరిగే గణతంత్ర వేడుకల్లో బహుమతులు అందించనున్నారు.

వివరాల సేకరణ

చెన్నూర్: మంచిర్యాల డీసీపీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు చెన్నూర్ మున్సిపాలిటీలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇళ్లు అద్దెకు తీసుకుని ఉంటున్న వారి వివరాలను బుధవారం పోలీసులు సేకరించారు. అద్దె ఇళ్లలో ఉంటున్న వారు ఎక్కడి నుంచి వచ్చారు, ఎన్ని రోజులుగా ఇక్కడ అద్దె ఉంటున్నారు. ఎంత మంది ఉంటున్నారనే వివరాలను సేకరించారు. ఎస్సై శ్వేత, పోలీసులు పాల్గొన్నారు.

కూలీలకు పనికల్పించాలి

భీమారం: అడిగిన ప్రతీ కూలీకి పని కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాస్ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాయంలో బుధవారం ఉపాధిహామీ పథకంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలు పనిచేసేందుకు పనుల కొరత లేకుండా చూడాలన్నారు. ఏపీవో ఎస్తర్, ఎంపీవో సతీష్‌రెడ్డి, కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దేశభక్తి మీద చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. పోటీలను డీజీఎం(పర్సనల్) గోవిందరాజు పరిశీలించారు. ఇందులో విజేతలకు గురువారం ప్రగతి మైదానంలో జరిగే గణతంత్ర వేడుకల్లో బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.లక్ష్మయ్య, ఉపాధ్యాయురాలు అనురాధ పాల్గొన్నారు.

నేడు ప్రగతి మైదానంలో గణతంత్ర వేడుకలు

శ్రీరాంపూర్: స్థానిక ప్రగతి మైదానంలో సింగరేణి ఆధ్వర్యంలో గురువారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి ముఖ్య అతిథిగా ఏరియా జీఎం సంజీవరెడ్డి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం ఎస్అండ్‌పీసీ, పాఠశాల విద్యార్థుల గౌరవ వందన స్వీకరించనున్నారు. దీని కోసం పెద్దయెత్తున ఏర్పాట్లు చేశారు.

నంనూర్‌లో గడపగడపకూ బీఆర్‌ఎస్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని నంనూర గ్రామంలో బుధవారం గడపగడపకూ బీఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యక్రమం చేపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, లబ్ధి పొందిన వారితో ముచ్చటిస్తూ రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జీవన్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నల్లబ్యాడ్జీలతో నిరసన

జైపూర్: మండలంలోని భాషా పండితులు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మిట్టపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు భాషోపాధ్యాయులు వేదాంతం విశ్వప్రసాద్ నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్‌లోని ఛాంబర్‌లో సింగరేణి సంస్థ నూతన సంవత్సర(2023) క్యాలెండర్‌ను బుధవారం ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆఫీస్ హెచ్‌వోడీ శ్యాంసుందర్, ఐఈడీ రాన్న, ఏజీఎం చక్రవర్తి, యూనియన్ ప్రతినిధులు ఉన్నారు.

సన్మానం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో టీఎన్జీవో కేంద్ర ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌కు నాయకులు సన్మానం చేశారు.

రైతులకు అవగాహన

తాండూర్: వరిసాగులో రైతులు ఆధునిక పద్ధతులు అలవర్చుకోవాలని మండల వ్యవసాయాధికారిణి కిరణ్మయి తెలిపారు. ద్వారకాపూర్‌లోని వ్యవసాయ క్షేత్రాలను బుధవారం సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు.

టీఎల్‌ఎం మేళా

జన్నారం: మండల కేంద్రంలోని రాఘవేంద్ర లిటిల్‌హార్ట్స్ పాఠశాలలో హిందీ ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా హిందీ టీఎల్ఎం వస్తువులను ప్రదర్శించి, వాటి గురించి వివరించారు. జెడ్పీటీసీ చంద్రశేఖర్, తహసీల్దార్ వెంకటకిషన్ పేర్కొన్నారు.